కొల్లేరు ప్రజల గోడు పట్టదా?

సుప్రీంలో ఇంప్లీడ్ పిటిషన్ వేయాలంటున్న కొల్లేరు ప్రజలు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కొల్లేరు నాయకులు(ఫైల్)

దెందులూరు: కొల్లేరుపై సుప్రీంకోర్టుకు ఇచ్చిన లెక్కలు అస్తవ్యస్తంగా ఉండటంతో కొల్లేరును నమ్ముకున్న లక్షలాది మంది ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. కొల్లేరు కొట్టేసినప్పటి నుంచి ఇంత వరకు దాదాపు 30 వేల మంది ఇతర ప్రాంతాలకు వలస పోయారు. కొల్లేరు గ్రామాల్లో ప్రజలకు సెంటు భూమి కూడా లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. పర్యావరణానికి ఎవరూ వ్యతిరేకం కాకపోయినా దశాబ్దాలుగా ఆవాసాలు ఏర్పరచుకున్న వారికి.. నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం సమంజసం కాదని ప్రజలు అంటున్నారు. సమస్య ఒకటైతే పరిష్కారం మరొకటి చూపడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదంటున్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 118 జీవో ద్వారా ఫిషర్‌మెన్ సొసైటీలు ఏర్పాటు చేసి చేపల సాగు చెరువులను ప్రోత్సహించారు. ప్రస్తుతం మూడో కాంటూరుకు కుదించి గ్రామాలను కాపాడి అభివృద్ధి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకోకపోవడంతో కొల్లేరులో జీవిస్తున్న లక్షల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు, ఉపాధి, సంక్షేమం కొరవడింది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేసి వాస్తవాలు చెప్పాలని.. లక్షలాది మంది ప్రజల భవిష్యత్‌ను పరిరక్షించాలని కోరుతున్నారు. కొల్లేరులో ప్రజల సమస్య పరిష్కారానికి నిపుణుల కమిటీ అఖిలపక్షాన్ని ఏర్పాటు చేస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అంటున్నారు.

సాగుకు అనుమతి ఇవ్వాలి



కొల్లేరులో జిరాయితీ భూముల రైతులకు న్యాయం చేయాలి. చేపల సాగుకు అనుమతి ఇవ్వాలి. ఉన్న పేదలందరికీ ఎకరం చొప్పున భూములు పంచాలి. కొల్లేరు కొట్టేసిన నాటి నుంచి నేటి వరకు ఆ ప్రాంత ప్రజలకు ఎంతో నష్టం జరిగింది. కొల్లేరు ప్రజలకు ఉపాధి, మౌలిక వసతులు కల్పన కల్పించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి.

– మోరు రామరాజు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు

రెగ్యులేటర్ నిర్మించాలి



కొల్లేరులో ప్రభుత్వం గుర్తించిన 67 నోటిఫైడ్ మేజర్, మైనర్, మీడియం డ్రైన్ల ఆధునికీకరణ జరగాలి. కొల్లేరు చివరి ప్రాంతం ఉప్పుటేరు వద్ద సముద్ర ముఖ ద్వారం వద్ద ప్రస్తుతం 12,000 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లేందుకు వీలు ఉంది. దానిని 25 వేల నుంచి 30 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లేలా ఆధునికీకరించి రెగ్యులేటర్ నిర్మించాలి.

– మండల కొండలరావు, వడ్డీలు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

మూడో కాంటూరుకు కుదించాలి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరును ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించాలి. చేపల సాగుపై ఆధారపడ్డ రైతులు కూలీలు, వ్యాపారస్తుల ఉపాధి, భవిష్యత్‌కు భరోసా కల్పించాలి. శాశ్వత పరిష్కార చర్యలు జరగాలి.

– ముంగర సంజీవ్ కుమార్, వడ్డీల కార్పొరేషన్ మాజీ చైర్మన్

5,500 ఎకరాలకు న్యాయం జరగాలి



దశాబ్దాలుగా కొల్లేరులో చేపల సాగు చేస్తున్న 5,500 ఎకరాలకు సంబంధించి న్యాయం జరగాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు తీసుకున్న చర్యలకు చట్టబద్ధత కల్పించాలి. దశలవారీగా అభివృద్ధి జరగాలి.

– పల్లెం ప్రసాద్, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

క్లుప్తంగా

సీతారామచంద్రస్వామి ఆలయంలో విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: సత్యనారాయణపురం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆలయ భక్త సమాజం పూజలు యాగాలు నిర్వహించారు. మే 1న ఆలయంలో మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో వందలాది మంది భక్తుల సమక్షంలో జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కొత్త ఉంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు తెలిపారు. సోమవారం కొత్తగూడెం , కొత్తుంగుటూరు గ్రామలలో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్యసూత్రలు ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు ఎస్తేరురాణి, ధనలక్ష్మి అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువలో ఐఫీడ్



లక్ష్మీ ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరరావు

పెదపాడు: ఆక్వారైతులకు నాణ్యమైన ఫీడ్‌ను చేరువ చేస్తున్నట్లు దీపక్ నెగ్జస్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ పలువురు వక్తలు తెలిపారు. పెదపాడు మండలంలోని గుడిపాడు గ్రామంలో లక్ష్మీ ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ దుకాణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ ఎంవీడీ మల్లేశ్వరరావు, ఐఫీడ్ సీఈఓ ఏవీ శేషాద్రి, వాల్విన్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టరు కురెళ్ల రాఘవేంద్ర ప్రభు పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఐఫీడ్ హెచ్‌ఎండీ రాజేశ్వరరావు హెచ్‌సీపీ ప్రోడక్ట్స్ హెచ్‌ఎం జీ దుర్గాప్రసాద్ సీనియర్ ఆర్‌ఎం శివనాగరాజు మరియు ఆక్వా రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని గుండుగొలను సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఈనెల 29వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏలూరు ఆపరేషన్లు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. గుండుగొలను గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నాణేల ప్రదర్శన



నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న కల్నల్ అమిత్ పాండే

ఏలూరు (టూటౌన్): స్థానిక డి పాల్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎన్‌సీసీ క్యాంపులో ఏలూరు నగరానికి నాణేల సేకరణ కర్త అలీఖాన్ మహమ్మద్ నాణేలను ప్రదర్శించారు. నాణేల గురించి ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆలీఖాన్ వివరించారు. ఈ ప్రదర్శనను క్యాంప్ ఆర్మీ కల్నల్ అమిత్ పాండే, క్యాంప్ సూపరింటెండెంట్ మామిళ్ల కొండయ్య, ఉమర్ ఖాన్, మానవతా నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావు, శ్రీహరికోటి, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు ఆర్మీ సుబేదార్ వినోద్ కుమార్, ఆదినారాయణ సిబ్బంది, డి పాల్ విద్యార్థులు, సిబ్బంది తిలకించారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో 1/2019 చట్టాన్ని అమలు చేయాలని, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థి రఫీని అభినందిస్తున్న వైస్ చాన్సలర్

దెందులూరు: ఆంధ్ర యూనివర్సిటీ జరిగిన లోగో కాంటెస్ట్‌లో ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి శేఖర్ రఫీ తన అద్భుత ప్రతిభను చాటాడు. సోమవారం వైజాగ్ ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లో వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ లోగో కాంటెస్ట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థి రఫీని ఘనంగా సత్కరించారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం మనోహర్, గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, గ్రామ నాయకులు తోట రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపీటీసీ నిరసన

దెందులూరు: ఎంపీటీసీ సభ్యురాలుగా ఎన్నికై 11 నెలలు పూర్తికావస్తున్న గౌరవ వేతనం వేయకపోవడం ఏమిటని చల చింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి ప్రశ్నించారు. సోమవారం చల చింతలపూడిలో ఆమె నిరసన వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను కూటమి ప్రభుత్వం ఎలా గౌరవ వేతనాలు ఇవ్వకుండా చేయడం ఎంతవరకు సభమని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాద్రి సత్యనారాయణ, వేమన నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కే శ్రీదేవి ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం సంబంధించి బిల్లును ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని వివరించారు.

వారపుసంతకు వడదెబ్బ



గణపవరం వారపుసంతలో కొనుగోలు దారులు లేక ఖాళీగా ఉన్న వ్యాపారులు



ఎండతీవ్రత నుంచి ఉపశమనం కోసం దుకాణాల ముందు నీటితో తడుపుతున్న దృశ్యం

గణపవరం: రోజంతా కొనుగోలు దారులతో రద్దీగా ఉండే గణపవరం వారపుసంత కొనుగోలుదారులు కనపడక వెలవెల బోయింది. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో బేరాలు లేక వ్యాపారులు బాతాఖానీ కబుర్లతో కాలం గడిపారు. సోమవారం సూరీడు సుర్రుమనడంతో ఎండతీవ్రతకు తాళలేక కొనుగోలుదారులు ఇళ్లనుంచి బయటకు రాలేదు. ఉదయం అరకొరగా సాగిన వ్యాపారం పదిగంటలు దాటే సరికిపూర్తిగా నిలిచిపోయింది. సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలు సంతకు రాక పోవడంతో వ్యాపారులు పూర్తిగా డీలాపడ్డారు. మధ్యాహ్న సమయంలో ఉష్ణతాపం తాళలేక వ్యాపారులు తమ దుకాణాలముందు బకెట్లతో నీరుతెచ్చి కళ్లాపి చల్లుకుండా కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రం సమయానికి కొనుగోలు దారులు రావడంతో వ్యాపారులు బిజీ అయిపోయారు. అయినా 50శాతం మేర మాత్రమే అమ్మకాలు జరిగాయని వ్యాపారులు వాపోయారు.

రోడ్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది



కంచి కామాక్షి కాలనీలోని రోడ్లను పరిశీలిస్తున్న గ్రామకార్యదర్శి కేవీఎల్ తనూజ

భీమడోలు: గ్రామాల్లోని కాలనీల్లో నిర్మించిన నూతన రోడ్లను గ్రామస్తులు పరిరక్షించుకోవాలని భీమడోలు గ్రామకార్యదర్శి కేవీఎల్ తనూజ అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ పరిధిలోని కంచికామాక్షి కాలనీలో రూ.2లక్షలతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. కాలనీల్లో నిర్మిస్తున్న రోడ్లపై ఇండ్లలోని మురుగునీరు రోడ్డుపై వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, త్వరగా రోడ్లు పాడైవుతాయని గ్రామస్తులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం అరుంధతీ కాలనీ, జక్కంశెట్టి వారి వీధి, లక్ష్మయ్య మిల్లు వెనుక ఏరియాల్లోని డ్రైనేజ్ అవుట్ లెట్ కోసం స్థల పరిశీలన చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చేబ్రోలులో ఐస్‌పరిశ్రమను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు: మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. సోమవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై)పథకంలో మంజూరైన 30 టన్నుల ఐస్‌పరిశ్రమను స్థానిక ఎమ్మెల్యే చేతులు మీదుగా, కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగు పర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, సర్పంచ్ రందే లక్ష్మీసునీత రాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి పి. నర్సయ్య, మండల మత్స్యశాఖ అధికారి కె.మంగరావు, పరిశ్రమ లబ్ధిదారులు ములగాల వరలక్ష్మి, మహ్మద్ అఫ్సరీలు గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

పెదవేగి : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పులువురు వక్తలు కొనియాడారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ డి పాల్ కాలేజ్‌లో 19 ఆంధ్ర బెటాలియన్ ఏటీసీ-1 క్యాంపు జరుగుతుందని నిర్వాహకులు 19(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్ పాండే అన్నారు. ఈ క్యాంపు ఈ నెల 24 నుంచి మే 3 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ 19వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కన్లాన్ అమిత్ పాండే ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు డీవైఈఓగా రవీంద్రభారతి



రవీంద్రభారతిని అభినందిస్తున్న ఏపీటీఎఫ్ 1938 నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి (డీవైఈఓ)గా రవీంద్ర భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు ఎంఈఓ-1 ఎ.రవి ప్రకాష్‌ను ఆయన సొంత స్థానానికి బదిలీ చేశారు. రవీంద్ర భారతి ప్రస్తుతం తాడేపల్లిగూడెం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా, ఉంగుటూరు ఎంఈఓ-1గా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. రవీంద్రభారతిని ఏపీటీఎఫ్ 1938 జిల్లా శాఖ నాయకులు కలిసి అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

ఏలూరు (టూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాకర్ అన్నారు. సీపీఐ 1వ డివిజన్ రెండో మహాసభ అడ్డగర్ల లక్ష్మీ ఇందిర అధ్యక్షతన ఆండాళ్లమ్మ తోటలో సోమవారం నిర్వహించారు. ప్రభాకర్ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్మిక పండుగ మేడేను ఏలూరు నగరంలోని వాడవాడలా జెంఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సహాయ కార్యదర్శిగా, వెదురుపర్తి శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎంలు



ఎస్పీ కార్యాలయం వద్ద మూతపడిన ఏటీఎం



చాణుక్యపురి కాలనీ వద్ద మూతపడిన ఏటీఎం

ఏలూరు నగరం ప్రధాన కూడళ్లలో ఎస్‌బీఐ ఏటీఎంలు గత రెండు నెలలుగా పనిచేయడం లేదు. జనసంచారం, మార్కెట్ ఉన్న ప్రాంతాల్లో ఉన్న ఈ ఏటీఎంలు పనిచేయక పోవపడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎం కార్డు తీసుకుని ప్రైవేటు బ్యాంకులకు వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



విజయవిహార్ సెంటరులో..



ఫైర్‌స్టేషన్ సెంటరులో..

ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫీల్డ్ టెక్నీషియన్ - ఎయిర్ కండిషనర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద ఈ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన వారు, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను మే, 10వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డీఎల్‌టీసీ కార్యాలయానికి పంపాలని, వివరాలకు సెల్ నెంబర్ 94934 82414లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



భీమడోలులో వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థులతో గ్రామ పెద్దలు

పెదపాడు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని పెదపాడు ఎంఈఓ డీవీ రమణ తెలిపారు. మండలంలోని పెదపాడులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం ఎంఈఓ డీవీ రమణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు చెస్ ఆటఆడటంపై విద్యార్థులకు వివరించారు. క్రమశిక్షణతో మెలగి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని తెలిపారు. అనంతరం కథలు చెప్పడం, కథలు వినిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేల్పుల ప్రభాకర్ శ్రీకృష్ణ గురుకులం కరస్పాండెంట్ భీమవరపు వంశీమోహన్, రామాల బెంజిమన్, శెటికం వెంకటేశ్వరరావు, జీవీ ఆంజనేయులు తదిరతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమడోలు శాఖా గ్రంథాలయం పరిధిలోని భీమడోలు నెం.1 పాఠశాల వద్ద జరిగిన వేసవి పునర్చరణ తరగతులకు అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, భీమడోలు ఎఎంసీ చైర్మన్ శేషపు గిరి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్తి మదన్‌లు పాల్గొని ప్రసంగించారు. వేసవిలో సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకునేందుకు గ్రంథాలయాలు సోపానాలన్నారు. పుస్తకం ప్రతి ఒక్కరిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదువుకునే వారు ఉన్నత స్థితి చేరుకుంటారన్నారు. విద్యార్థులంతా ప్రభుత్వ బడుల్లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మానవత మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీ బాబు, గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, అభివృద్ధి కమిటి గౌరవ అధ్యక్షుడు పైడిమాల యుగంధర్, పెద్దలు మద్దాల అప్పారావు, తాటిమళ్ల శ్రీ రామ్మూర్తి, రామకృష్ణ, ఈతకోట సత్యకృష్ణ, అజయ్, రమణ, కాబోతుల సోమేశ్వరరావు, గొర్రెల పవన్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించిన ఎంఈఓ డీవీ రమణ



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం వలీ

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

దెందులూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానాన్ని ఆపాదించాలని పోతునూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.కె వలి అన్నారు. సోమవారం పోతునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వ్యాసరచన, క్విజ్, చదరంగం, ఇతర పోటీల్లో కూడా విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను చాటుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ యేసయ్య మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోనును అవసరం మేరకే వినియోగించాలన్నారు. గ్రంథాలయ అధికారి రాంబాబు మాట్లాడుతూ వ్యాసభలో విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా గ్రంథాలయాలకు పంపించేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు



చేబ్రోలులో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపును సోమవారం తొలగించారు. దాంతో జాతీయరహదారి విశాలంగా కనిపిస్తోంది. ఈ ఆక్రమణలు తొలగింపుకు అధికార్లుకు అయిదు నెలలు పైనే పట్టింది. నాలుగుసార్లు ముహుర్తాలు పెట్టి కూడా ఆక్రమణలు తొలగించలేకపోయారు. దీనికి కారణం అధికార్లు, శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే. పోలీసులు కూడా ముహుర్తులు సమయానికి వేరే డ్యూటీలు పడటంతో ఇంతకాలం జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో అధికార్లు నడుంబిగించారు. ఈమేరకు సోమవారం ఉదయమే అన్ని శాఖలు అధికార్లు 13 టీంలుగా ఏర్పడి ఆయా సెంటర్లలో ఆక్రమణలు తొలగించేందుకు నిమగ్నమయ్యారు. ఏకకాలంలో ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం సెంటర్లో ఆక్రమణలు తొలగించడం జరిగింది. ఎంపీడీవో రాజ్‌మనోజు సారథ్యం వహించారు. నిడమర్రు సీఐ సుబాష్ ఆధ్వర్యంలో ఉంగుటూరు ఎస్ఐ సూర్య బగవాన్ ,మరో ఇద్దరుఎస్‌ఐలు, పోలీసులు 30మంది మొహరించారు.